సనాతనిష్టు విభ్రమం

మా తాలూకా పల్లెటూళ్ళలో గమనించదగిన విశేషం ఏమిటంటే—

అరుగులు. వాటిని గురించి రాయాలంటే ఎంతయినా ఉంది.

ఈ అరుగులు వీధివాకిలి కిరువైపులా ఉంటూ నామమాత్రంగా ఇంటివారి హక్కు భుక్తములలో ఉన్నవయి, క్రియకు ఊరి వారందరికి ప్రైవేటు మీటింగులు చెయ్యటానికి ఉపయోగపడుతూ ఉంటవి. అది లచ్చయ్యగారి అరుగు కానివ్వండి, సనాతనిష్టు యాజులుగారి అరుగు కానివ్వండి, అడివి శంకరయ్య గారిది కానివ్వండి. మీరు ఆ గ్రామస్తులు కనక అయినట్లయితే, ఆ అరుగు 'విడిగా' వున్నప్పుడు మీరు వెళ్ళి, అప్పటికి అక్కడ హాజరులో ఉన్న నలుగురయిదుగురితోనూ మీరు దానిమీద ఒక సభచేసి, మీలాగా ఆ సమయానికి ఆ ప్రదేశములో హాజరుగా ఉండనట్టి ఏ కొందరిని గురించి గాని దూషణ భూషణ తిరస్కారాదులు జరిపి, మీపని పూర్తి కాగానే పై బట్టలు దులిపి ఎవరి దారిన వారు చక్కా పోవచ్చును. ఇందుకెవరి అభ్యంతరమున్నూ ఉండబోదు.

ఇది బస్తీలలో వల్లపడదు. ఉత్త మునిసిపాలిటీల శకంలోనే పర్మిషనులనీ, లైసెన్సులనీ పెట్టి, వీధి మీదికి ఉండే అరుగుల అభివృద్ధికి చాలా అంతరాయాలు ఏర్పాటు చేశారనుకుంటే, కమీషనర్లూ, స్పెషల్ ఆఫీసర్లూ రావటంతో బస్తీలలో వాళ్ళు బయటి అరుగులకు పూర్తిగా నీళ్ళు విడిచి పెట్టవలసి వచ్చింది.

అన 19...సం॥ ది 6 జూన్ తారీఖు...గ్రామ కాపురస్తులు (1) కలవా గౌరీశ్వర సోమయాజులు (వురఫ్ సనాతనిష్టు యాజులు) (2) అగస్త్యుల సీతాపతి శాస్త్రి; వీరుగాక నలుగురు బ్రహ్మచారులూ కలిసి గౌరీశ్వర సోమయాజుల వారి వీధి అరుగులమీద సదరు యాజులవారి ఆధిపత్యం కింద ఒక చిన్న అన్‌లావ్‌ఫుల్ ఎసెంబ్లి అయినారు.

"చలవయ్య బావకూతురు వచ్చిందే!" అన్నాడు శంకరం.

"అంత దూరాన చూసి ఎవరో కిరస్తానీ పంతులమ్మేమో అనుకున్నా. తీరా చూస్తే మన మిస్సమ్మే!" అంటూ సీతాపతి బ్రహ్మచార్లకేసి కన్నుమలిపాడు. బ్రహ్మచార్లు తలలు ఎగరవేసి నవ్వారు.

"అది ఆ ఇంగిలీషు చదువులో ఉంది, ఇంగిలీషు చదువు మనకందరికీ కిరస్తానీ కూడు కుడుపటానికి కాదూ వచ్చింది?.... ఏమిటో లచ్చయ్య అభిప్రాయం?"

"ఎప్పుడో చల్లగా పిల్లదానికి పెళ్ళిచేసేస్తాడు. అంతకన్న అభిప్రాయం ఏముంటుంది? దాని చదువూ, దాని వేషం, దాని వాలకం-అంతా కళ్ళఎదట కనపడు తూనే ఉందిగా!" అన్నాడు సీతాపతి.

"ఆహా! కనపడకేం? వాళ్ళతాత దాని అవతారం చూస్తే ప్రాయోపవేశం చేసి ఉండేవాడు.... దీనికేదో చెయ్యాలి మనం. నేను లచ్చయ్యతో ఖచ్చితంగా ఒకసారి మాట్లాడాలని అనుకుంటున్నా, ఏమంటావు, సీతాపతీ?"

"కానియ్యి మరి, శుభస్యశీఘ్రం. ఏదోవిధంగా నలుగురి తలకాయలూ ఒక చోట చేర్చి పార్టీలు తీసేసుకున్నామా? మళ్ళీ లచ్చయ్య కూతురి పెళ్ళి చెయ్యటం, నేను చెయ్యలేదు అదే చేసుకుంది అనటం, కొందరు వెళ్ళటం, కొందరూ వాళ్ళింటికి వెళ్ళకపోవటం.... కానీండి! అదేదో దబ్బున తేల్చుకుంటే మళ్ళీ మనపార్టీల గోలలో మనం పడదాం!" అన్నాడు సీతాపతి, ఊరి పాలిటిక్సు యావత్తూ తన నెత్తిమీదిగానే వెళుతున్నట్టు.

"నువ్వేరా, అడివీ?"

"మరేం లేదుగాని, బాబాయి; గాంధిమహాత్మ అంటారు గదా—"

"ఓరి నీ గాంధిమహాత్ములు గడ్డలుగానూ! మతాన్ని గంగలో కలుపటానికి చూస్తున్న కోమటి ముండాకొడుకును పట్టుకు వదలడేమండీ ఈనా?" అన్నాడు యాజులు.

"మరేం లేదుగాని ఆయన వెధవల్ని పెళ్ళాడమని ఉత్తరువు చేశారు కదా! అని చెప్పబోయినాను!" అన్నాడు శంకరయ్య.

"వాడికేం? వాడు రేపు మలభక్షణ చెయ్యమంటే చేస్తావుట్రా!" అన్నాడు యాజులు కదులుతున్న పళ్ళు బిగబట్టి.

"ఏం లాభమంటాను? జుట్టు దువ్వుకుంటుందీ, పూలు పెట్టుకుంటుందీ, చదువుకొంటుందీ! వైధవ్యం తప్పుతుందా? పోయిన పసుపూ కుంకం మళ్ళీ వస్తయ్యా? రావూ! పెళ్ళి చేసుకోటం కల్లోవార్తా! దానికి పెళ్ళిచేసి లచ్చయ్య ఊళ్ళో ఒక్క ఘడియ ఉండగలడూ?" అని అడిగాడు యాజులు ధీమాగా.

"ఎట్లా ఉంటాడూ?" అని తిరిగి అడిగాడు సీతాపతి.

"ఎందుకుండడూ?" అన్నాడు శంకరయ్య దేన్నోగురించి ఆలోచిసూ. బ్రహ్మాచార్లంతా నవ్వారు.

"ఎవరు వారు!" అన్నాడు యాజులు అనవసరంగా కళ్ళమీదికి ఎండ పడుతుందేమో నన్నట్టు చెయ్యి అడ్డంపెట్టి. అప్పుడే చీకటి పడబోతున్నది. దారి వెంట నెత్తిన పెద్ద గడ్డిమోపుతో వెళుతున్న మనిషి ఆ ప్రశ్నవిని ఆగి, "నేనే, మామా!" అన్నాడు.

"సుబ్బన్నా! కుప్ప కొట్టించావుట్రా ? మీ వెధవ—"

"అయితే ! మామా ! మన లచ్చయ్యగారింటి కెవరో వస్తున్నారే ! పాతి కేళ్ళవాడు. సాయిబల్లే ఉన్నాడు. ఏ వూరంటిని; చెప్పలా ! లచ్చయ్యగారి ఇంటి కని మటుకు అన్నాడు."

"ఎందాకా వచ్చాడేం ?"

"సూరయ్యగారి వామిదాకా వచ్చి ఉంటాడు!" అంటూ సుబ్బన్న సాగాడు.

ఎసెంబ్లి మెంబర్లు మొహమొహాలు చూసుకున్నారు. లచ్చయ్యగారింటికి సాయిబులుకూడా రావటందాకా వస్తే, ఇక ఎవరివల్లా అయేదేమీ లేదు. 'పార్టీలు' తప్పవనేమో సీతాపతి నిట్టూర్పు విడిచాడు. ఆలోచన అభినయించుతూ బ్రహ్మాచార్లు మెడలు గోక్కోటం మొదలు పెట్టారు. ఇంతటిలో వీధి చివర ఆగంతకుడి ఆకారం కనిపించింది. బొందిలాగు సాయిబుల పోషను ఐయితే చెప్పలేం కాని వచ్చే కుర్ర వాడిలో సాయిబు లక్షణాలేమీ లేవు. అతనికి పాతికేళ్ళూ లేవు. ఇరవై రెండుకన్నా ఎక్కువ ఉండవు.

"ఎవరు వారు ?" అన్నాడు యాజులు గంభీరంగా.

"తమరెవరు ?" అన్నా డాగంతకుడు సవినయంగా.

"ఏవూరు ?" అన్నాడు సీతాపతి.

"తమది ?" అని తిరుగు ప్రశ్న వచ్చింది.

"ఓయ్ !" అన్నాడు యాజులు.

"చిత్తం ! సరిగా ఆమాటే నేనూ అందామనుకుంటున్నాను. ప్రశ్నలకు సమాధానం చెప్పటం ఇష్టంలేనివాళ్ళు ఎన్నడూ ప్రశ్నలు వెయ్యకండి !" అంటూ ఆగంతకుడు లచ్చయ్యగా రింటివేపు సాగిపోయినాడు.

* * *

యాజులు పెద్ద సందిగ్ధావస్థలో పడ్డాడు. ప్రసాదరావు రాక ఆయన పాను లన్నిటినీ తారుమారు చేసింది. యాజులు, పాపం, మతాన్ని గురించీ, ధర్మాన్ని గురించీ లచ్చయ్యగారి ఎదుట ఏకరువు పెట్టడానికి చిన్న ఉపన్యాసం తయారు చేశాడు. ఏం లాభం ? అంతా బూడిదను బోసిన పన్నీరయింది. ఆ కుర్రవాడి ఎదట ఆ ఉపన్యాసం వెళ్ళవలసిన తీరుగా వెళ్ళదు. యాజులు ఉత్తమ శ్రేణికి చెందిన సనాతనిష్టు కాదని కాదు. కుర్రకుంకను చూస్తే ఆయనకు భయమనీకాదు, అదొక మనోదౌర్బల్యం.

అందుకని యాజులు తన ప్రయత్నంనించి విరమించవలసిందేనా ? ఒక్క నాటికీ కాదు. అన్నిటికీ ఉన్నాడుగా పాపాల భైరవుడు, తిక్కశంకరయ్య !

యాజులుగారు అర్జంటుగా రమ్మంటున్నారని ఒక బ్రహ్మచారి వచ్చి శంక రయ్యకు కబురు అందించి వెళ్ళిపోయినాడు. అప్పుడే బోంచేసి భుక్తాయాసం తీర టానికి మంచం వేసుకుంటున్న శంకరయ్య మంచం అక్కడే వదిలిపెట్టి యాజులు గారింటికి ప్రయాణమైనాడు.

"ఒరే, శంకరం! ఈపని నీవల్లనే కావాలి."

"అదెంత భాగ్యం! ఏంచెయ్యమంటావు నన్ను ?"

"ఒక్కసారి నువ్వు లచ్చయ్యగారింటికి పోయిరావాలి."

"ఇప్పుడు! నుంచున్నట్టుగా రానూ ?" అంటూ శంకరయ్య బయలుదేరాడు.

"ఒరే ! ఒరే ! ఏమిటా పోవటం ? పోయి ఏం చేస్తావు ?"

"ఏం చెయ్యమన్నావో చెప్పుమరీ !"

"నిన్న లచ్చయ్యగారింటికి వచ్చిన కుఱ్ఱవాడెవరో, ఎందుకు వచ్చాడో, వాడూ సరోజినీ ఒకరితో ఒకరు లేచిపొయ్యేట్టున్నారేమో - వెకవెకలూ పకపకలూ ఆడుతున్నారేమో- చూసిరావాలి. నేను పంపించానని చెప్పేవు సుమా! నువ్వు మరీ ఎద్దు మొద్దు స్వరూపానివి; ఆఁ? వెళ్ళు ! ఏవేం తెలుసుకోగలవో అవన్నీ తెలుసుకురా ! తరువాత ఆలోచిద్దాం !"

అడివి శంకరయ్య 'లచ్చయ్యబాబూ !' అంటూ లోపలికి వచ్చేటప్పటికి నిన్న వచ్చిన కుఱ్ఱవాడు ఒక కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చూస్తున్నాడు. అతని వెనకగా కుర్చీమీద చేతులు పెట్టి సరోజిని ఆ పుస్తకమే చూస్తున్నది. ఇద్దరూ చెప్ప తరం కాకుండా విరగబడి నవ్వుతున్నారు. ఇంకేం ఒక పాయింటు తేలిపోయింది. ఈ యిద్దరూ లేచిపోవటం రూఢే ! యాజులెంత దూరాలోచన కలవాడు !

"రండి తాతగారూ, కూర్చోండి!" అని ప్రసాదరావు శంకరయ్యను గౌరవం చేశాడు, తనే గృహయజమానల్లే.

శంకరయ్య దూరంగా కూర్చున్నాడు. ఆయనకు, చప్పు చప్పున వెయ్యవలసిన ప్రశ్నలన్నీ వేసేసి యాజులుముందు ఎప్పుడు వాలుదామా అని ఉంది. ఎట్టా ఉపక్రమించాలో తెలియలేదు. చివరకు తెగింపుచేసి "మీదే గ్రామం, నాయనా ?" అన్నాడు శంకరయ్య.

"నేను ప్రస్తుతం పట్నంలో ఆనర్సు చదువుతున్నానండీ !" అన్నాడు ప్రసాదరావు.

"మా లచ్చయ్య నీకేం కావాలి బాబూ ?"

"నాకేమీ అక్కర్లేదు !" అన్నాడు ప్రసాదరావు చాలా తాపీగా.

శంకరయ్య నిర్ఘాంతపోయినాడు. చదువుకున్నవాళ్ళు మాట్లాడితే అర్థం చేసుకోవటం కష్టమని ఆయనకు తెలుసును. కాని ఇంత కష్టమని ఆయన ఎన్నడూ అనుకోలేదు. "ఏమిటది?" అని అడిగితే తన మర్యాదకు భంగం కలుగుతుందని దాన్ని అంతటితో పోనిచ్చాడు.

"అట్లాగా? అయితే నువ్వీ గ్రామం ఏం పనిమీద వచ్చావు బాబూ?"

"సరోజిన్ని చూసిపోదామనీ, మిమ్మందర్నీ కలుసుకుందామనీ!"

శంకరయ్య ఈ సమాధానానికి ఆశ్చర్యపోయినాడు. సామాన్యంగా ఇంగ్లీషు చదువుకున్న వాళ్లకు ఇంత కలుపుగోలుతనం ఉండదు. శంకరయ్యకు మరికొంచెం

సేపు కూర్చుని ఈ మంచి కుర్రవాడితో గాంధీమహాత్ముల గురించి మాట్లాడదామని పించింది.

"ఏమండీ, తాతగారూ! మిమ్మల్ని యాజులుగారేనా పంపించింది?"

శంకరయ్య నిర్ఘాంతపోయినాడు. ఇది కేవలం గారడీగా ఉంది. ప్రసాదరావు ఆయన కంగారుచూసి నవ్వుతూ, "నన్ను మీ వూరివారు ఎరగరుగాని నేను అందర్నీ ఎరుగుదును" అన్నాడు.

"ఇదిగో చూడు, నాయనా! యాజులు నన్నిక్కడికి పంపించినమాట ఎవరితోనూ చెప్పవద్దన్నాడు, నీకు తెలిస్తే తెలిసిందికాని ఇంకెవరికీ చెప్పకు. నువ్వు కూడానే అమ్మాయి! ఆఁ!"

"అయితే తాతగారూ! మీకు గాంధీమహాత్ముడంటే గురికదా? మీరు యాజులూ వాళ్ళతో ఎందుకు కలుస్తారూ? ఇప్పుడు సరోజిని పెళ్ళి చేసుకుంటానంటే యాజులు వద్దంటాడు! అదే గాంధీ మహాత్ముడైతే తప్పకుండా చేసుకోమంటాడు! గాంధీమహాత్ముడు ఎక్కువా? యాజు లెక్కువా?"

"చాలా ముఖ్యమయిన విషయం తీసుకొచ్చావు. చూడు బాబూ! గాంధీ మహాత్ములకు హిందూ ధర్మమంటే యిష్టమని చెబుతారే? వెధవ ముండల పెళ్ళిళ్ళు ఎప్పుడూ తప్పే! విన్నారూ?"

"గాంధీ మహాత్ముడికికూడా ఆ ముక్క తెలుసు!"

"ఆఁ! ఆఁ! అట్లాగా?" అంటూ చెవులు రిక్కించి వినటం మొదలు పెట్టాడు శంకరయ్య. ఇంత తెలివిగల కుర్రవాణ్ని తను ఎన్నడూ చూసి ఎరగడు. "ఆఁ! ఆఁ!"

"అయితే ఇది ఏ యుగం?"

"ఆఁ!"

"చెప్పండి! ఇది ఏ యుగం?"

"కలియుగం కాదూ?"

"కాదూ మరీ? కలియుగంలో ధర్మం ఒక్కపాదం మీదనే నడవాలి! యుగధర్మం పాటించాలి. వానాకాలంలో మామిడిపళ్ళు రావడం లేదా? మామిడిపళ్ళు మంచివే కావటానికి! ఏమంటారు?"

"బాగుంది! బాగుంది! ఎట్లాగూ!"

"గాంధీ మహాత్ముడు అవతారం కనక ఆయన యుగధర్మం అమలులో పెడతాడు గాని సనాతన ధర్మం లెక్కచెయ్యడు. రాముడేం చేశాడు? తన యుగధర్మం పాటించి రాక్షసులను సంహరించాడు. కృష్ణుడు ఏం చేశాడు? రాక్షసులను చేరదీశాడు. ఘటోత్కచుణ్ణి పాండవుల పక్షాన ఉంచాడు. చూడండి ఈ చిత్రం! అది యుగధర్మం! వెధవ ముండలు పెళ్ళిచేసుకుతీరాలి. అది యుగధర్మం. ఇంకో చిత్రం చూడండి. ఈ సనాతనులు కృతయుగధర్మం తెచ్చిపెట్టాలని చూస్తారు

చూశారూ? వాళ్ళంతా లోపల అమిత పాపాత్ములు. వాళ్ళకెప్పుడూ ఇంకోళ్ళ యావే! ఇప్పుడూ మీవంటి పుణ్యాత్ములకు సరోజిని పెళ్ళిచేసుకుంటే దిగులా? మీరూ సంతోషిస్తారు, ఒక బుద్ధిమంతురాలు సుఖపడుతున్నది కదా అని. అవునంటారా, కాదంటారా?"

"అది సుఖపడితే నేను సంతోషించనా? నాకు కూతుళ్ళు లేరూ! నా కూతు కొకటీ అదొకటీనా నాకు?"

"యాజులు చూడండి మరి! ఎవరు ఏ పెళ్ళి చేసుకున్నా తన ధర్మం చెడదు కద. ఎవరన్నా సుఖపడుతుంటే ఆయనకు ఏడుపు! అనకూడదు కాని ఆయన సరోజిని వంక అసహ్యకరంగా చూస్తాడుట, చూపులతో శరీరమంతా తడివినట్టవు తుందిట పాపం, సరోజినికి!"

శంకరయ్య మళ్ళీ నిర్ఘాంతపోయినాడు-నమ్మలేకపోయినాడు. "యాజులే? కాకపోయినా ఆ ముండాకొడుకు అందరివంకా అట్లాగే చూస్తాడు. ఏమో, ఎవరు చెప్పగలరు? బ్రహ్మకైన పుట్టు రిమ్మతెగులు!"

"మీ కాశ్చర్యంగా ఉన్నట్టుంది. నేనింకా ఈ ఊళ్ళో నాలుగు రోజు లుంటాను. మీకు స్వయంగా చూపిస్తాను కాదూ ఆయన ప్రకృతి!" అన్నాడు ప్రసాదరావు.

* * *

సరోజినీ, ప్రసాదరావూ ఎవరి ఆలోచనలో వారు ఉండిపోయినారు.

"నీ దుర్మార్గం కొంచెం దుస్సహంగా ఉందిరా. ప్రసాదరావూ!" అంది సరోజిని.

"నీకు తెలియకపోతే నీవు ఊరుకోరాదుటే! ఆడదానివి నీకీవిషయాలేం తెలుస్తై? రెండు అబద్ధాలాడి ఒక కొంప నిలబెట్టమన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీ పెళ్ళి ఐన మరుక్షణం మీ నాన్నను యాజులు వెలివేయించగలడు. ఆ గాడిద కోరలు తీసేసికాని నే నిక్కణ్ణించి కదలను. తెలిసిందా? నీకేం ? నీ దారిన నువ్వు నీ మొగుడితో కులుకుతూ చక్కాపోతావు. ఇక్కడ పెదనాన్న పాట్లు కుక్కలూ, నక్కలూ పడవు. యాజుల్ని హతమార్చుతాను."

"అదంతా బాగానే వుంది. పాపం, ఈ పిచ్చివాణ్ణి నువ్వు గోల చేస్తుంటే నాకు కష్టంగా ఉంది."

"శంకరయ్యా ?....మన చేతికి వజ్రాయుధం దొరికింది. దాన్ని ఉపయోగించుకోవద్దంటావేం ? నా అవసరం కొద్దీ ఈ ఆయుధాన్ని నేను పట్టుకోడానికి అనువయిన పిడి వేసుకుంటున్నాను. తప్పా ?"

"ఏమో, సాటి మనిషిని గురించి చేతి కర్రను గురించి మాట్లాడేటట్టు మాట్లాడితే తప్పో రైటో నేనేం చెప్పను ?"

"ఓఁ! నీ సెంటిమెంట్సు ప్రస్తుతం కట్టిపెట్టు. నేను శంకరయ్యకేమీ అప కారం చెయ్యబోవటం లేదు."

* * * *

లచ్చయ్యగారి ఇల్లు వదిలిపెట్టిన తరువాత శంకరయ్య పారవశ్యంలో తన కోసం అరుగుమీద కనిపెట్టుకుని ఉన్న యాజులు మాటే మరిచిపోయి యేకా యెకి కొంప చేరుకొన్నాడు. అతగాడి ముఖారవిందం కోసం నిరీక్షించి నిరీక్షించి విసికి యాజులు తూర్పు పొలం వెళ్ళాడు.

మర్నాడు ఉదయం ఇద్దరు బ్రహ్మచార్లు శంకరయ్య చెరొక చెయ్యీ పట్టు కుని యాజులు గారింటికి నడిపించుకుంటూ వచ్చారు. తానీషావద్దకు తీసుకు రాబడుతూ రామదాసు రాముణ్ని గురించి పలుకుతూ వచ్చినట్లు శంకరయ్య ఎవరికీ అర్థం కాకుండా 'గాంధీ మహాత్ముని' గురించి ఏవో అరుస్తూ వస్తున్నాడు. మధ్య మధ్య 'నే చెప్పలా?' అని దబాయించి అడుగుతున్నాడు. 'అన్నీ చెప్పావులే!' అంటున్నారు బ్రహ్మచారులు.

యాజులు బ్రహ్మచార్లను వాళ్ళపని చూసుకోమని పంపించి, "ఏంరా, శంక రయ్యా! ఏం చేసుకొచ్చావు?" అన్నాడు.

"పనయితే చేసుకొచ్చాను. అంతా చెప్పమంటే నేను కూడబలుక్కో లేను. నువ్వడుగు; నేను చెప్పకపోతే అప్పుడను!"

"ఆ కుర్రవాడిది ఏ వూరు?"

"అదేదో చెప్పాడమ్మా! పట్నం. అదుగదీ! పట్నం!"

"పట్న మేమిటి?"

"అవునూ! పట్నంలో ఆనర్సు చదువుతున్నాట్ట!"

"ఆనర్సేమిటి?"

"ఆఁ! నాకు తెలుసేడుచునా, ఏమన్నానా?"

"ఇంతకూ వా డే వూరి వాడంటే పట్నమంటా వేమిరా?"

"అదే చెప్పాడు మరి!"

"బాగుంది! ఇక్కడి కెందుకు వచ్చాట్ట?"

"అదేదో—ఆఁ! మనల్ని అందర్నీ చూడటానికి వచ్చానన్నాడు."

"హోరి పిడుగా!"

"నా మాట నమ్మకపోతే నువ్వే వెళ్ళి అడగవచ్చును!"

"నిన్ననటంలేదు లేవోయ్! వాడు నీవంటివాళ్ళను పదిమందిని కలిసి అవు పోసనం పుచ్చుకునేట్టున్నాడు. అయితే యింతకూ ఏమంట్రాడ్రా వాడూ? అదీ వాడూ వెకవెక లాడుతున్నారా?"

"అట్లా అడుగు చెబుతాను! వాళ్ళిద్దరూ తప్పకుండా పెళ్ళి చేసుకుంటారు.

ఆ మాట ఆ కుర్రవాడే చెప్పాడు ! పైగా దాంట్లో తప్పులేదని కూడా ఋజువు చేశాడు !"

"ఛీ, భ్రష్టుడా !"

* * *

యాజులు అవస్థ వర్ణనాతీతంగా ఉంది. లచ్చయ్యగారింటికి వచ్చిన కుర్ర వాడి పేరు మాత్రం ఎట్లాగయితేనేం బయటపడ్డది. ఆ పైన ఒక్క నలుసయినా తెలియలేదు. తీరా సమయానికి గ్రామంలో లచ్చయ్య భార్యకూడా లేకుండా పోవట మేమిటి—తన కర్మం కాకపోతే ! ఆవిడ ఉంటే ఏ ఇల్లాలి ద్వారానయినా బయటికి లాగవచ్చును—ఆ కుర్రవాడెవరో; వాడికి లచ్చయ్యగారింట ఏం పనో, వాడూ ఆడీ (సరోజిని) అస్తమానమూ వెక వెకలూ పకపకలూ పడటానికి హేతువేమిటో ఇత్యాది వివరాలు.

పోనీ లచ్చయ్యనే నిలవేసి అడుగుదామంటే ఆ కుర్రవాడెప్పుడూ లచ్చయ్య వెంట ఉంటూ లచ్చయ్యను పలకరించినప్పుడల్లా తనే అందుకుని చావ గొట్టేస్తాడు. అతడి మాటలు బొత్తిగా అర్థంకావు. తెలుగో అరవమో కూడా తెలియదు. పైగా అతను మాటాడుతున్నంత సేపూ ఇంకొకరి మాట చొరనివ్వడు.

శంకరయ్య,—పిచ్చి ముండాకొడుకు - ఎందుకూ కొరగాకుండా ఉన్నాడు.

ఆ కుర్రవాడు వచ్చి అప్పుడే మూడు రోజులయింది. వాణ్ణి గురించి తెలుసు కోవలసింది చూడబోతే బోలెడుంది. తెలుసుకొన్నది బొత్తిగా ఏమీలేదు.

ఈ మనోవ్యాధి చాలనట్టు శంకరయ్య కిందటిరాత్రి ఇంకో విశేషం కూడా చెప్పి వెళ్ళాడు— ఎంత మటుకు నిజమో! ఆ ప్రసాదరావూ ఈ సరోజిని బయటి గదిలో పక్క పక్కగా మంచాలు వేసుకుంటూ పడుకుంటారుట. ఇదే నిజమయితే—నిజమని రుజువు చెయ్యగలిగితే— లచ్చయ్య భరతం పట్టించవచ్చును. ఔరా! తమ అందరి కళ్ళల్లోనూ ఇంత తాల్చినకారం కొట్టి, ఇంట మిండడిని తెచ్చిపెడతాడా లచ్చయ్య? ఊరు గొడ్డుపోయిందనుకున్నాడా?

ఆ రాత్రే ఈ విషయ మేమిటో తేల్చాలని పట్టుపట్టాడు యాజులు. ఇంకొ కర్ని మద్దతుగా ఉంచుకుంటే సాక్ష్యం ఉంటుందని ఆలోచన తట్టింది. కాని కన్నంలో దొరికే దొంగకు ఏ సాక్ష్యం కావాలి కనక ? ఒకవేళ ఇంతాజేసి ఏమీ లేకపోతే రెండో వాడితో చిక్కుంటుంది– అని యాజులు తను చెయ్యదల్చుకున్న కాస్త అన్వేషణా స్వయంగానే చేద్దామనుకున్నాడు.

* * *

రాత్రి పదిన్నర అయింది. వీధి నిర్మానుష్యంగా ఉంది. అంతవరకూ అక్క డక్కడా అరుగులమీద చేరి ఆత్మస్తుతి కాకపోయినా పరనింద చేస్తున్న గ్రామస్తులు ఒక్కొక్కరే నిష్క్రమించారు.

గుడి మండపంమీద చీకట్లో ప్రసాదరావూ శంకరయ్యా కూచుని చాలా రహస్యంగా మాట్లాడుకుంటున్నారు.

"నేనూ సరోజినీ ఒక చోట పడుకుంటామని ఆ ముసలాడి కెందుకు చెప్పావయ్యా?" అన్నాడు ప్రసాదరావు.

"అయ్యో! నేను చెప్పలా!" అన్నాడు శంకరయ్య.

"అయితే సరే! కొంపతీసి చెప్పావేమో అని అన్నాలే! ఎందుకంటే ఇప్పుడతడికీ సరోజినిమీద భ్రమ ఉంది కాదూ? అసూయపడతాడు, తెలియలే?"

"తెలిసింది" అన్నాడు శంకరయ్య నిట్టూర్పు విడిచి. అక్కడికి ఒక గండం గడిచింది. నోరుజారి అన్నాడు శంకరయ్య యాజులతో ఆ మాట. చెప్పలేదని ప్రసాదరావు నమ్మాడు కనుక ఫరవాలేదు అనుకున్నాడు. శంకరయ్య చెప్పినట్లు ప్రసాదరావు సులభంగానే గ్రహించాడు. అసలు అదే అతనికి కావలసింది కూడా.

"ముసలాడికి పిల్లదాని మీద భ్రమ ఎంత ఉందీ నీకు తెలీదు, తాతా! నీకు బహూశా ఈవేళే చూపించగలుగుతానేమోగా! తొందర ఎందుకూ?"

"నేను నమ్మలేకుండా ఉన్నా నబ్బా! యాజులు అగ్నిహోత్రం! అటువంటి వాడు కాడు!.... అయినా చూద్దాంగా!"

"అవును, తినబోతూ రుచులడగడం ఎందుకూ? ఒక్కరోజుకే తొందరపడకు. రెండు మూడు రోజుల్లోనే రహస్యం బట్టబయలు చేస్తాను.... ఎందుకూ? అ-డు-గో! మన యాజులు! భేష్! జాగర్తగా గమనిస్తూండు, ఏం చేస్తాడో! మాట్లాడకు."

యాజులు మెల్లిగా లచ్చయ్యగారింటి వైపు వచ్చాడు. వీధిలో ఎవరూలేరు. ఎటుపోయి ఎటువచ్చినా మంచిదని లచ్చయ్య ఇంటిముందు ఆగి వంగి అరికాల్లో ఏదో అంటినట్టు నటించి దులుపుకున్నాడు. ఎక్కడా ఏమీ అలికిడిలేదు. ఆయన మెల్లిగా లచ్చయ్యగారి అరుగెక్కి కిటికీ తలుపుల సందుగుండా గదిలోకి తొంగి చూడాలి. అదీ కార్యక్రమం. తీరా ఉపక్రమించుదా మనుకుంటుండగానే గుండెలు టపటపలాడటం మొదలుపెట్టినై. ధైర్యం చెయ్యాలని చూశాడు. లాభం లేకపోయింది. అరుగు ఎక్కవలసిన యాజులు అరుగుదాకా వెళ్ళి దానిమీద చతికిల బడ్డాడు. ఇంకా కొంచెం సేపటికి మిగతా కార్యక్రమం జరపటానికి తగిన సత్తా రావచ్చునేమో కాని ఇప్పటి కింతవరకే సత్తా ఉంది.

ఎక్కడో ఏదో చప్పుడయింది. యాజులు గుండె బద్దలయింది. దబ్బున అరుగుమీదినించి దిగి వీధి మధ్యకు వచ్చి రెండడుగులు వేసి ఆగాడు. ఏమిటీ పిరికితనం? తెగించి మళ్ళీ వెళ్ళి అరుగుమీద కూర్చున్నాడు. అంతవరకూ అదివరకు ఒకసారి చేసిన పనేగా! పైన ఏమి చేతామూ అని అనుమానిస్తుండగా గదిలో గాజుల చప్పుడయింది. ఎవరో ఆడది నిద్రమత్తున కొద్దిగా మూలిగింది.

ఇక సంకోచించి లాభంలేదనుకున్నాడు యాజులు. ఈ ప్రయత్నంలో తన గుండె పగిలిపోవటంవల్ల ప్రాణాలు పోయినాసరే గదిలో ఏమి జరుగుతున్నదో చూసి

తీరవలసిందే. లోకం యావత్తూ నిద్రావస్థలో ఉంది. తనకు రాగల ఆపద ఏమిటి? కుర్రవాడల్లె భయపడితే ఏం లాభం? తనకు యాభై తొమ్మిదో ఏడు! ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు? ఇప్పుడు తన వయస్సు ఏ పదో పన్నెండో ఉంటే బాగుండును!........

* * *

"ఇకరా! మన కిప్పుడా పెద్ద మనిషితో కొంచెం పని ఉంది! దిగు. చప్పుడు చెయ్యకు!" అంటూ ప్రసాదరావు చల్లగా మండపం మీదినించి వీధిలోకి జారి శంకరయ్యను కూడా దింపాడు.

యాజులు మనుష్యుల సందడికి వెనక్కు తిరిగి వీధివైపు చూస్తున్నాడు.

"ఎవరు వారు?"

యాజులు సరిగా అడుగెత్తు ఎగిరాడు. చప్పున అరుగుమీదినించి దిగి రోడ్డు మీద నుంచున్నాడు. తను చేస్తున్న పనికి ఇద్దరు సాక్షులు. ఒకడు ఆ గదిలో ఉండవలసిన ప్రసాదరావూ, రెండోవాడు పిచ్చిముండాకొడుకు. శంకరయ్యా!

"ఏహా! యాజులవారా! ఏదో పనిమీద ఉన్నారల్లే ఉంది. సరోజిని మేలుకునే ఉందేమో, తలుపు తట్టకపోయినారా?" అన్నాడు ప్రసాదరావు.

శంకరయ్యకి నాజూకులు తెలియవు మోట దెబ్బే తప్ప.

"అయితే, నిన్న అరగంటనించీ గమనిస్తున్నాను. ఎందుకట్లా కాలుకాలిన పిల్లల్లే అరుగు లెక్కా, దిగా, లోపలికిచూడా, అటూ ఇటూ పరీక్షచెయ్యా— ఏమిటిది? ఏమిటి నీ ఉద్దేశం? నువ్వింత విడిచేసిన వాడివని నేను ఎన్నడూ అనుకోలేదు. ఛీ!"

యాజులు మాటాడవలసిన అగత్యం వచ్చింది. కాని ఆయన వేసిన గుటక వల్ల ఏం చెబుతున్నాడో సరిగా తెలియలేదు వినేవాళ్ళకు.

"అక్— నేనుక్— యాక్!"

ఇక లాభంలేదని యాజులు ప్రయత్నం మాని మౌనం వహించాడు. మాటాడినా మానినా గుటకలు తప్పలేదు.

"మీరుకూడా అట్లా అంటారేం, తాతగారూ! పెద్దవాడాయన చూస్తే తప్పేం వచ్చిందీ? ఆ గదిలో వుండేది సరోజినీయేగా!"

"పెద్దతనం బుగ్గయినట్టే ఉంది! ఏం చూస్తున్నావంటే గుడ్లుపెట్టుకు చూస్తూ మాట్లాడడేం?" అన్నాడు శంకరయ్య.

"ఆయనన్నడగటం ఎందుకూ? ఇప్పుడే తేలుస్తాను. సరోజినీ!"

"ఎవరది?" అంటూ సరోజిని తలుపు తెరిచింది. ఒక చేత్తో కుచ్చెళ్ళు సర్దుకోవటంచూస్తే అప్పుడే బట్ట కట్టుకోవటం అయినట్టు కనపడుతున్నది. "నువ్వట్రా, అన్నయ్యా? ఎక్కడికి వెళ్ళావు భోంచేసి?"

"ఇక్కడే మండపం మీద కూచున్నాం. నేను శంకరయ్య తాతా— నువ్వు గదిలో ఏం చేస్తున్నావు?"

"బట్ట కట్టుకున్నాను, ఏం?"

"ఏం లేదులే! నీవు లోపలికి పదవే, అమ్మాయి! నాకింకా కొంచెం పనుంది."

ప్రసాదరావు సంతోషంతో పొంగిపోతున్నాడు. అతను పెద్ద నాటకం ఆడాడు. అందుకు అనేకమంది సహాయం చేశారు. ముందు పెత్తల్లీ, లచ్చయ్య గారి భార్యా ఊళ్ళో లేకుండా ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తరవాత లచ్చయ్య ప్రసాదరావు ఫలానా అని ఎవరికీ తెలియకుండా నెగ్గించుకొచ్చాడు. తరవాత శంకరయ్య తన బుట్టలో చాలా ఒడుపుగా పడ్డాడు. సరోజిని తనవంతు వచ్చేటప్పటికి తన పోర్షను చక్కగా నటించింది. ఇంత నాటకం ఈ యాజులు ముండాకొడుకు పరాభవానికా? కాలాన్ని వెనక్కు తిప్పాలని చూస్తున్న మూర్ఖులలో ఈ యాజులు ఒకడు. ఇతడిచేత సరోజినీ, ఆమె తండ్రీ చాలా బాధపడవలసి ఉన్నారు.

ప్రసాదరావు పళ్ళు బిగబట్టి, "పెద్దవాడివై పోయినావు. ఇంకోళ్ళి ఐతే చీల్చి ఉందును, వెళ్ళు" అని ఉరిమాడు.

"చేసేది శివపూజలూ, దూరేవి దొమ్మర గుడిసెలూ! ఈ మొహానికి గాంధీ మహాత్ములు చాల్లేదుట. ధర్మాన్ని ఉద్ధరించేటందుకు అవతరించాడు— అవతారం!"

ఒక్క క్షణం యాజులుకు లోపలినించి ఉద్రేకం వస్తున్నది. దాన్ని ఎట్లా బయటపెట్టినా వెధవ కావటం తప్ప ఏమీలేదు.

తలవంచుకొని యాజులు ఇంటిదారి పట్టాడు.

ప్రసాదరావు ఆయనవంకే చూస్తూ "ఆ పరిస్థితుల్లో నేనైతే అంత గాంభీర్యంగా ఉండగలనా?" అనుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు శంకరయ్య.

"ఏమీలేదు!" అంటూ అతను లోపలికి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

ముద్రణ : వినోదిని, నవంబరు 1935